క్లుప్తంగా

బోనాల ఉత్సవాలకు కేంద్రమంత్రికి ఆహ్వానం



కేంద్రమంత్రిని ఆహ్వానిస్తున్న గ్రామస్తులు

కొడిమ్యాల: మండలంలోని చెప్యాలలో నూతనంగా నిర్మించిన పోచమ్మ ఆలయలో ఈనెల 13న నిర్వహించే బోనాల పండుగకు రావాలని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మంగళవారం కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమానికి హాజరు కావడానికి మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, సునీల్‌రెడ్డి, ప్రవీణ్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు



ఎమ్మెల్యేకు చిత్రపటం అందిస్తున్న ఆర్ఎంవో

జగిత్యాల: జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి ఆర్ఎంవోగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన నరేశ్ ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఆయన స్వయంగా గీసిన ఎమ్మెల్యే చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఎమ్మెల్యే ఆర్ఎంవోను అభినందించారు. టీజీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్ సైతం ఎమ్మెల్యేను కలిశారు.

బీర్‌పూర్ ఎస్సై..

జగిత్యాలరూరల్: బీర్‌పూర్ ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్.రాజు మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, నాయకులు కోల శ్రీనివాస్, రమేశ్, లింగంగౌడ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో బీఎల్‌వోల పాత్ర కీలకం



మాట్లాడుతున్న అధికారులు

సారంగాపూర్: ప్రజాస్వామ్యంలో బీఎల్‌వోల (బూత్ లెవల్ అధికారులు) పాత్ర కీలకమని తహసీల్దార్ వహిదొద్దీన్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బూత్ లెవల్ అధికారులకు ఓటరు నమోదు, ఓటు వేయడం, తొలగించడం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటరు నమోదు, ఓటు వేసే వరకు క్షేత్రస్థాయిలో మొదట ఓటరును కలిసేది బీఎల్‌వో అని పేర్కొన్నారు. ఓటరును వివిధ కారణాలతో తొలగించే విషయంలోను బీఎల్‌వోలదే కీలకమని తెలిపారు.కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశం, ఏఎల్ఎంటీ, రెవెన్యూ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏ ప్రకటించాలి



సభ్యత్వ నమోదులో ఉపాధ్యాయులు

మేడిపల్లి: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయ ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న డీఏ,పీఆర్సీ లను వెంటనే ప్రకటించాలని, నగదు రహిత వైద్య సేవలు అందించాలని తపస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తపస్ ఆధ్వర్యంలో భీమారం మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినపల్లి ప్రసాదరావు, జిల్లా కో కన్వీనర్ నీలిమ, మండల అధ్యక్షుడు గడ్డం తిరుమల్ రెడ్డి, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ

రాయికల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ వైద్యులు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టులు రవి, కిరణ్, సృజన, ఉపాధ్యాయులు సీఎం.శర్మ, లక్కాడి రాజిరెడ్డి, రమేశ్, సీఆర్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మపురిలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మెట్‌పల్లిలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మల్లాపూర్‌లో..



కొడిమ్యాలలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మల్యాలలో నాయకుల నివాళి



పెగడపల్లిలో..

వైఎస్సార్‌కు ఘన నివాళి

కోరుట్ల/ధర్మపురి/మెట్‌పల్లి/రాయికల్/కథలాపూర్/పెగడపల్లి/మల్యాల/కొడిమ్యాల/మల్లాపూర్/మేడిపల్లి/బుగ్గారం: మహానేత దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం, నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాలు, పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో పేదలకోసం వైస్సాఆర్ ప్రవేవపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బుగ్గారంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



మేడిపల్లిలో కాంగ్రెస్ నాయకుల నివాళి



రాయికల్ మండలం దావన్‌పల్లిలో గిరిజనుల పూజలు



పెగడపల్లి: ఏడుమోటలపల్లి తండాలో గిరిజన మహిళల సంబరాలు



మల్లాపూర్ అటవీప్రాంతంలో పూజలు చేస్తున్న గిరిజన మహిళలు



పాటిమీది తండాలో మొక్కులు చెల్లించుకుంటున్న తండావాసులు

వైభవంగా శీత్లా భవాని వేడుకలు

రాయికల్/మెట్‌పల్లి రూరల్/కథలాపూర్/పెగడపల్లి/మల్లాపూర్: గిరిజనుల ఆరాధ్య దైవం శీత్లా భవాని వేడుకలు పలు మండలాల్లోని గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు, పశువులు బాగుండాలని భవానీని వేడుకున్నారు. మహిళలు నెత్తిన బోనాలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లి వనదేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు, యువతులు, పిల్లలు డప్పు చప్పుళ్లతో సంప్రదాయకమైన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో వివిధ పార్టీల నాయకులు, గిరిజన మహిళలు పాల్గొన్నారు.



అంబారిపేట శివారులో పూజలు చేస్తున్న గిరిజనులు

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న కమిషనర్, అధికారులు

కోరుట్ల: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్ గౌడ్ అన్నారు. పట్టణంలో మంగళవారం వన మహోత్సవం ప్రారంభించి మాట్లాడారు. సీఎం పిలుపు మేరకు ప్రతీ ఆడబిడ్డ రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే రాష్ట్రం ఆకుపచ్చ తెలంగాణగా మారుతుందన్నారు. మహిళా సంఘాలు మనిషికి ఒక మొక్క అనే నినాదంతో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రెవెన్యూ ఆఫీసర్ క్రాంతి కుమార్, శివకుమార్, మహేశ్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి మంత్రి చేయూత



మృతదేహం వద్ద కాంగ్రెస్ నాయకులు

బుగ్గారం: మండలంలోని వెల్గొండ గ్రామానికి చెందిన రఫీక్ అనారోగ్యంతో కరీంనగర్‌లోని ప్రతిమ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. అయితే లక్ష రూపాయల వరకు ఆస్పత్రి బిల్లు కాగా అంత చెల్లించే స్థోమత తమకు లేదని రఫీక్ కుటుంబ సభ్యులు దాతల సాయం కోసం ఎదురుచూశారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆస్పత్రి నిర్వాహకులతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. అంతేకాకుండా తగిన ఏర్పాట్లు చూడాలని స్థానిక నాయకులను మంత్రి ఆదేశించగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల సుభాష్,నాయకులు నర్సాగౌడ్ మృతుడి ఇంటికి వెళ్లి పరామర్శించి వారి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబసభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి

జగిత్యాల: అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని ఇన్‌చార్జి డీఈవో సత్యనారాయణ అన్నారు. జిల్లాలోని పీఎంశ్రీ ఉన్నత పాఠశాలలకు మంజూరైన అటల్ టింకరింగ్ ప్రయోగశాలల నిర్వహణపై భౌతిక, గణిత, జీవశాస్త్ర ఉపాధ్యాయులకు మంగళవారం శిక్షణ కల్పించారు. ఒక్కో పాఠశాలలో రూ.10 లక్షల వ్యయంతో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేస్తామని, ఉపాధ్యాయులు శిక్షణ పొంది విద్యార్థులకు సమగ్రంగా చెప్పాలని పేర్కొన్నారు. ప్రయోగ పరికరాలను పాఠశాలలకు అందించామన్నారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఈ ప్రయోగశాలలు ఉపయోగపడతాయన్నారు. నోడల్ అధికారి మచ్చ రాజశేఖర్, కో–ఆర్డినేటర్ రాజేశ్, మనోజ్‌కుమార్, దేవేందర్ పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి వస్తే చర్యలు

వెల్గటూర్ : కేజ్‌వీల్స్‌తో రోడ్ల పైకి వస్తే ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేస్తామని వెల్గటూర్ ఎస్సై ఉమాసాగర్ అన్నారు. కేజ్‌వీల్స్‌తో రోడ్ల పైకి రావడం వల్ల కోట్లాది రూపాయలతో వేసిన రోడ్లు ధ్వంసమై, గుంతలుగా మారి వర్షాకాలం ప్రజా రవాణాకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. గుంతల్లో పడి ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నందునా.. కేజ్ వీల్స్‌కు పట్టీలు అమర్చుకోవాలని, లేని పక్షంలో ట్రాలీల ద్వారా తరలించాలని సూచించారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్టు

కథలాపూర్: మండలకేంద్రంలో భూమి విషయంలో హత్యాయత్నానికి పాల్పడిన కథలాపూర్‌కు చెందిన తిక్క రాహుల్, కోరుట్లకు చెందిన టేకులపెల్లి ఆదిత్యను మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఈ నెల 6న కథలాపూర్‌లో తిక్క మల్లేశ్‌ను భూమి విషయంలో రాహుల్, ఆదిత్య కలిసి కర్రలతో దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారు. ఈ కేసులో దర్యాప్తు చేసి రాహుల్, ఆదిత్యలను మంగళవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పర్యావరణ సమతుల్యతకు మొక్కలు నాటాలి

మల్లాపూర్: పర్యావరణ సమతుల్యత కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దామెర రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిరిపూర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం వనమహోత్సవంలో పాల్గొని ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, జలందర్, నాయకులు పాల్గొన్నారు.

నేతకాని మహార్ మహాసభ విజయవంతం చేయాలి

సారంగాపూర్: ఈ నెల 20న మంచిర్యాలలో జరిగే నేతకాని మహార్ మహసభను విజయవంతం చేయాలని నేతకాని మహార్ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ అన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో మంగళవారం ఆయన పర్యటించి మంచిర్యాల సభకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయడంలో జాప్యం వీడాలని కోరారు. ఆయన వెంట సంఘ నాయకులు మీసాల లింగం, దుర్గం శంకర్ , గోపాల్, చంద్రయ్య, మల్లయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఎస్సై బాధ్యతలు స్వీకరణ

బుగ్గారం: మండల ఎస్సైగా గొంగటి సతీశ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎస్సైగా ఉన్న మాడ శ్రీధర్‌రెడ్డి మేడిపెల్లికి బదిలీ కాగా, ట్రెనీ ఎస్సైగా ఉన్న సతీశ్ బుగ్గారం ఎస్సైగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. నేరాలను అరికట్టడానికి ప్రజలు సైతం తమ వంతుగా సహకారం అందించాలన్నారు.

ప్రత్యేకాధికారిగా..

కొడిమ్యాల: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా హార్టికల్చర్ అధికారి శ్యాంప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేకాధిరిని ఎంపీడీవో స్వరూప, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి ఆహ్వానించారు.

శ్రీకృష్ణ పారాయణం

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాసలో బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణ పారాయణం మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పారాయణం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.


మహిళల అభ్యున్నతికి పథకాలు

జగిత్యాలరూరల్:మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని సెర్ప్ ఏపీడీ సునీత అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో అన్నపూర్ణ, అక్షర మండల సమైక్య ఆధ్వర్యంలో ఇందిరా మహిళాశక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళాసంఘాల కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని, అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తోందని పేర్కొన్నారు. మహిళలు వ్యాపారాలు, స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో డీపీఎం విజయభారతి, ఏపీఎం గంగాధర్, సీసీలు గంగారాం, విద్యాసాగర్, శ్రీనివాస్, శ్రీనిధి మేనేజర్ రాణి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి సహకారం

మల్లాపూర్: ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి సహకారం అందిస్తామని ప్యాక్స్ డైరెక్టర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు సుతారి రాజేందర్ అన్నారు. మండలంలోని పాతదాంరాజుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు రూ.20వేల విలువ గల షూలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గజ్జి రాజరెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలు



మహిళా సంఘాల సభ్యులు, ఐకేపీ సిబ్బంది

పెగడపల్లి: మండల కేంద్రంలో ఐకేపీ (సెర్ప్) కార్యాలయంలో మంగళవారం ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండల సమాఖ్య సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్డీలేని రుణాలు, పెరటి కోళ్ల పెంపకం, డెయిరీ, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, ఇతరాత్ర స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం వివిధ వ్యాపారం నిర్వహిస్తున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం సమత, సెర్ప్ సిబ్బంది, సీఏలు, వీవోఏలు పాల్గొన్నారు.

ధర్మకర్త నియామకానికి దరఖాస్తులు ఆహ్వానం

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం రెన్నొవేషన్ కమిటీ ధర్మకర్తగా నియమించడానికి ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ అధికారులు తెలిపారు. ఆసక్తిగల వారు తమ దరఖాస్తులను 20 రోజుల్లో దేవాదాయశాఖ కమిషనర్, జాయింట్ కమిషనర్, ఉప కమిషనర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్‌స్కూల్‌లో మంగళవారం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 50 మంది విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొత్తపల్లి రంజిత్ కుమార్, ప్రధాన కార్యదర్శి బోడుగం అంజిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్, సంగెం–శ్రీరాంపూర్, కొత్తదాంరాజుపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, గైడ్లు, ఇతరసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

ధర్మపురి: పట్టణంలోని పాత హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం పేద విద్యార్థులకు గునిశెట్టి అంజన్న సహకారంతో విద్యార్థులకు నోటుబుక్స్, షూలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడాల రవీందర్, సభ్యులు పాల్గొన్నారు.

రాయితీపై కంది విత్తనాలు పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని రైతు వేదికలో రైతులకు రాయితీపై కంది విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. పప్పు దినుసుల పంటల సాగును ప్రోత్సహించాలని రాయితీపై కంది విత్తనాలు అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బోరిగం రాజు, ఏవో రాజుకుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఏఈవోలు వినోద్, రవళి, సాయికృప, రైతులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలం సత్తక్కపల్లి గ్రామానికి చెందిన బక్కశెట్టి స్వామి అనారోగ్యంతో మృతి చెందగా ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్ నుంచి మంజూరైన చెక్కును కుటుంబసభ్యులకు అందజేశారు.గ్రామానికి చెందిన స్వామి ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్‌లో స్మార్ట్ ఫార్చ్యూన్ బిల్డర్ ప్లాన్ కింద ఇన్సురెన్స్ కట్టాడు. ఇటీవల గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఇన్సురెన్స్ కవరేజ్ రూ.20.21 లక్షల విలువ గల చెక్కును మృతుడి భార్య రాజేశ్వరికి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో డివిజనల్ సేల్స్ మేనేజర్ అనిల్, టెర్రిటరీ మేనేజర్ మహమూద్,ఎల్ఎం ప్రెసిడెంట్ క్లబ్ మెంబర్ ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం

రాయికల్: మండలంలోని లోక్యనాయక్‌తండాలో గత ఐదేళ్లుగా డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో రోడ్లపైకి మురికినీరు రావడంతో గిరిజన యువ నాయకుడు సంతోష్‌నాయక్ స్పందించి తన సొంత డబ్బులతో రోడ్డు తవ్వించి సిమెంట్ పైపులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.